


# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా






సంపుటి - 07 | సంచిక 272 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 02, సెప్టెంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# రెవెన్యూ కార్యాలయాల చుట్టూ.. సామాన్యుడి ప్రదక్షిణలు !



భూమి సమస్య వస్తే చాలు.. సామాన్యుడి అడుగులు రెవిన్యూ కార్యాలయం వైపు పరుగులు తీస్తున్నాయి. దరఖాస్తులు, పత్రాలు సమర్పించినా.. సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఎందుకు? ఒక ఫైల్ చకచకా కదులుతుంటే.. మరొక ఫైల్ ఎందుకు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటోంది? ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నా.. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఎందుకు ఏర్పడుతోంది? భూ రికార్డుల్లో చిన్న తప్పు జరిగినా.. దాన్ని సరిచేయించుకునేందుకు సామాన్యుడు పడుతున్న అవస్థలకు బాధ్యత ఎవరిది? భూ సమస్యల పరిష్కారంలో మధ్యవర్తుల ప్రమేయం, అక్రమ డబ్బు డిమాండ్లపై వస్తున్న ఆరోపణల వెనుక అసలు నిజం ఏమిటి? ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు ఎక్కడ.. ఆధారాలు లేకుంటే నిజాయితీగా పనిచేసే అధికారులకు రక్షణ ఎక్కడ? ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్ నంబర్.. ప్రతి ఫైల్‌కు నిర్ణీత గడువు.. ప్రతి ఆలస్యానికి బాధ్యత నిర్ధారణ ఎప్పుడు? పెండింగ్ ఫైళ్లపై ఉన్నతాధికారుల సమీక్షలు, ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు జరుగుతున్నాయి? ప్రజల భూమి.. ప్రజల హక్కు.. మరి ఆ హక్కు కోసం సామాన్యుడు రెవిన్యూ కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేయాలి? ఇదే జై భీమ్ సూటి ప్రశ్న!

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రెవిన్యూ కార్యాలయాల చుట్టూ సామాన్యుడి ప్రదక్షిణలు..!

భూ సమస్యల పరిష్కారంలో జాప్యం..

అవినీతి ఆరోపణలపై జవాబుదారీతనం ఎక్కడ..?

మధ్యవర్తుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు..?

అధికారిక వ్యవస్థలో లోపం ఎక్కడ..?

భూ రికార్డుల్లో తప్పులు.. సరిచేయించుకోవడానికి సామాన్యుడికి చుక్కలు..!

కొంతమంది ఫైళ్లు చకచకా.. మరికొందరివి నెలల తరబడి పెండింగ్..!

ఆన్‌లైన్ సేవలు ఉన్నా.. కార్యాలయాల చుట్టూ తిరుగుడు ఎందుకు..?

ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్.. ప్రతి ఫైల్‌కు నిర్ణీత గడువు అవసరం..!

అవినీతిపై ఫిర్యాదు చేసే వారికి రక్షణ ఎక్కడ..?

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు..

పెండింగ్ సమస్యలపై సమీక్ష ఎప్పుడు..?

నిజాయితీగా పనిచేసేవారికి రక్షణ..

తప్పు చేసినవారిపై చర్యలు తప్పనిసరి..!

ప్రజల భూమి.. ప్రజల హక్కు.. మరి పరిష్కారం కోసం ఇన్ని ప్రదక్షిణలెందుకు..?

జై భీమ్ సూటి ప్రశ్నలు.. సమాధానం చెప్పాల్సింది ఎవరు..?

ఆరోపణల వెనుక అసలు నిజం ఏమిటి..? జై భీమ్ ప్రత్యేక పరిశీలన..!

డాక్టర్ బరిగెల శివ

2

## జీహెచ్ఎంసీలో భారీ ఆర్థిక కుంభకోణం..!

డబుల్ బిల్లులు.. ఎక్సెస్ చెల్లింపులు.. రూ.70 కోట్ల ప్రజాధనం ఎటు పోయింది..?

2

## హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు.. ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

### హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు

### భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు

### గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు

### హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి

### సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# జీహెచ్‌ఎంసీలో భారీ ఆర్థిక కుంభకోణం..!

**డబుల్ బిల్లులు.. ఎక్సెస్ చెల్లింపులు..**
**రూ.70 కోట్ల ప్రజాధనం ఎటు పోయింది..?**

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

ప్రజాధనాన్ని కాపాడాల్సిన వ్యవస్థలోనే భారీ ఆర్థిక అవకతవకలు జరిగాయనే ఆరోపణలు జీహెచ్‌ఎంసీని కుదిపేస్తున్నాయి. ఏకంగా 102 మంది కాంట్రాక్టర్లకు దాదాపు రూ.70 కోట్ల మేర డబుల్ బిల్లులు చెల్లించినట్లు వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారితీసింది. డబుల్ బిల్లులు మాత్రమే కాకుండా, కొన్ని సందర్భాల్లో అవసరానికి మించి ఎక్సెస్ అమౌంట్ కూడా చెల్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటపడిన తర్వాత అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే 12 మంది కాంట్రాక్టర్ల నుంచి సుమారు రూ.7 కోట్లు తిరిగి వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే అసలు ప్రశ్న మాత్రం మిగిలే ఉంది. రూ.70 కోట్ల మేర అనుమానాస్పద చెల్లింపులు జరిగితే, ఇప్పటివరకు వసూలు చేసిన రూ.7 కోట్లతోనే వ్యవహారం ముగుస్తుందా? మిగిలిన మొత్తం ఎక్కడ ఉంది? బాధ్యులు ఎవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### విషయం బయటపడిన తర్వాతే చర్యలా..?

ఇంత భారీ స్థాయిలో డబుల్ బిల్లులు ఎలా చెల్లింపుకు వెళ్లాయి? ఒకే బిల్లును రెండుసార్లు చెల్లించే పరిస్థితి ఏర్పడే వరకు అకౌంట్స్, ఫైనాన్స్, ఆడిట్ వ్యవస్థలు ఏం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కోట్లాది రూపాయల చెల్లింపులకు అనేక స్థాయిల్లో పరిశీలన ఉండాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఇంత భారీ మొత్తం చెల్లింపులో అవకతవకలు జరగడం వెనుక వ్యవస్థాగత వైఫల్యమా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### విజిలెన్స్ ఎంక్వైరీకి కమిషనర్ ఆదేశాలు

ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. విజిలెన్స్ విచారణలో డబుల్ బిల్లులతో పాటు ఎక్సెస్ అమౌంట్ చెల్లింపుల అంశాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తూ, జీహెచ్‌ఎంసీలో ఫైనాన్షియల్ అడ్వైజర్ హోదాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆడిట్ శాఖ అధికారి శరత్ చంద్రను విధుల నుంచి తప్పించినట్లు సమాచారం.

### ఒక్కరిపైనే చర్యతో సరిపెడతారా..?

అయితే ఇక్కడ మరో కీలక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రూ.70 కోట్ల స్థాయి చెల్లింపులు ఒక్క అధికారి నిర్ణయంతోనే జరిగాయా? బిల్లులను పరిశీలించిన అధికారులు ఎవరు? వాటికి ఆమోదం తెలిపిన వారు ఎవరు? చెల్లింపులను ప్రాసెస్ చేసిన వ్యవస్థలో మరెవరి పాత్ర ఉంది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. 12 మంది కాంట్రాక్టర్ల నుంచి రూ.7 కోట్లు వసూలు చేయడం ద్వారా మిగిలిన వ్యవహారాన్ని పక్కదారి పట్టించకుండా, 102 మంది కాంట్రాక్టర్లకు జరిగిన మొత్తం చెల్లింపులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అక్రమంగా చెల్లించిన ప్రతి రూపాయిని తిరిగి రాబట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

### ప్రజాధనానికి జవాబు చెప్పాల్సిందే..!

ఇది కేవలం అకౌంటింగ్ పొరపాటా? తీవ్రమైన నిర్లక్ష్యమా? లేక మరేదైనా వ్యవస్థాగత లోపమా? అన్నది విజిలెన్స్ విచారణలో తేలాల్సి ఉంది. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజాధనానికి జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో రికవరీ చేయాలి అనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. రూ.70 కోట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులందరి పాత్రను బయటపెట్టి, వసూలు చేసిన మొత్తం ఎంత? ఇంకా ఎంత రికవరీ చేయాలి? అనే వివరాలను జీహెచ్‌ఎంసీ ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

# ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ వేడుకకు హాజరైన నాయిని నీలిమారెడ్డి



హనుమకొండ, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

హనుమకొండలోని పిస్తా హౌస్ బాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ జితేందర్‌రెడ్డిని కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏసీపీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు తదితరులు పాల్గొని జితేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# అంతులేని శోకాన్ని మిగుల్చిన ప్రళయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్): నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్‌షోలను కూడా సిద్ధం చేసింది.ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాట్మాండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది.

# రెవిన్యూ కార్యాలయాల చుట్టూ సామాన్యుడి ప్రదక్షిణలు..!

**భూ సమస్యల పరిష్కారంలో జాప్యం.. అవినీతి ఆరోపణలపై జవాబుదారీతనం ఎక్కడ..?**
**మధ్యవర్తుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు..?**
**అధికారిక వ్యవస్థలో లోపం ఎక్కడ..?**
**భూ రికార్డుల్లో తప్పులు.. సరిచేయించుకోవడానికి సామాన్యుడికి చుక్కలు..!**
**కొంతమంది ఫైళ్లు చకచకా.. మరికొందరివి నెలల తరబడి పెండింగ్..!**
**ఆన్‌లైన్ సేవలు ఉన్నా.. కార్యాలయాల చుట్టూ తిరుగుడు ఎందుకు..?**
**ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్.. ప్రతి ఫైల్‌కు నిర్ణీత గడువు అవసరం..!**
**అవినీతిపై ఫిర్యాదు చేసే వారికి రక్షణ ఎక్కడ..?**
**ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు.. పెండింగ్ సమస్యలపై సమీక్ష ఎప్పుడు..?**
**నిజాయితీగా పనిచేసేవారికి రక్షణ.. తప్పు చేసినవారిపై చర్యలు తప్పనిసరి..!**
**ప్రజల భూమి.. ప్రజల హక్కు.. మరి పరిష్కారం కోసం ఇన్ని ప్రదక్షిణలెందుకు..?**
**జై భీమ్ సూటి ప్రశ్నలు.. సమాధానం చెప్పాల్సింది ఎవరు..?**
**ఆరోపణల వెనుక అసలు నిజం ఏమిటి..? జై భీమ్ ప్రత్యేక పరిశీలన..!**

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భూమికి సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా సామాన్యుడి అడుగులు ముందుగా పడేది రెవిన్యూ కార్యాలయం వైపే. పట్టా కావాలన్నా.. మ్యుటేషన్ చేయించుకోవాలన్నా.. వారసత్వ హక్కు నమోదు చేయించుకోవాలన్నా.. భూ రికార్డుల్లో తప్పులు సరిచేయించుకోవాలన్నా.. సర్వే చేయించుకోవాలన్నా రెవిన్యూ శాఖను ఆశ్రయించాల్సిందే. భూమి అంటే సామాన్యుడికి కేవలం మట్టి కాదు.. కుటుంబ ఆస్తి, జీవనాధారం, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు భరోసా. అలాంటి భూమికి సంబంధించిన రికార్డుల్లో చిన్న తప్పు జరిగినా దాని ప్రభావం ఒక కుటుంబం మొత్తంపై పడే అవకాశం ఉంది. అయితే సమస్య పరిష్కారం కోసం రెవిన్యూ కార్యాలయాల గడప తొక్కుతున్న సామాన్యులకు అనేక చోట్ల జాప్యం, పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగడం, ఫైళ్లు పెండింగ్‌లో ఉండటంతో పాటు అవినీతి ఆరోపణలు ఎదురవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తు ఇచ్చాం.. పత్రాలు సమర్పించాం.. అయినా ఫైల్ ఎందుకు కదలడం లేదు..? ఒక పని కోసం ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరగాలి..? చట్టబద్ధంగా అందాల్సిన ప్రభుత్వ సేవ కోసం అదనపు డబ్బు ఎందుకు చెల్లించాలి..? అనే ప్రశ్నలు సామాన్యుల నుంచి వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల "అధికారి లేరు.. మరోసారి రండి.. ఫైల్ పరిశీలనలో ఉంది.. ఇంకో పత్రం తీసుకురండి.." అంటూ దరఖాస్తుదారులను తిప్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక రైతు లేదా పేద కుటుంబానికి ప్రతిసారి కార్యాలయానికి రావడం అంటే ప్రయాణ ఖర్చుతో పాటు ఒక రోజు పనిని కోల్పోవడం. అయినప్పటికీ తమ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో స్పష్టత లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. రెవిన్యూ వ్యవస్థపై ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్న మరో అంశం అవినీతి ఆరోపణలు. కొన్ని భూ సంబంధిత పనులు త్వరగా పూర్తిచేయాలంటే అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేలు, మ్యుటేషన్లు, వారసత్వ హక్కుల నమోదు, పేర్ల సవరణ, రికార్డుల్లో మార్పులు, భూ సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కొందరు సిబ్బంది లేదా మధ్యవర్తులు డబ్బులు అడుగుతున్నారనే ఫిర్యాదులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఎవరినీ దోషులుగా నిర్ధారించడం సరికాదు. అదే సమయంలో ప్రజల నుంచి పదేపదే ఫిర్యాదులు వస్తున్నప్పుడు వాటిని పూర్తిగా విస్మరించడం కూడా సమంజసం కాదు. ఆరోపణలు నిజమా.. నిరాధారమా.. అన్నది నిష్పాక్షిక విచారణ ద్వారా తేల్చాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులపై ఉంది. నిజాయితీగా పనిచేసే అధికారుల ప్రతిష్టకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే, అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని రెవిన్యూ కార్యాలయాల్లో సామాన్య ప్రజలకు అధికారిక ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడం, ఫైల్ ఏ దశలో ఉందో తెలియకపోవడం, ఏ పత్రాలు అవసరమో స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి. కొందరి ద్వారా పని త్వరగా జరుగుతుందనే భావన ఏర్పడితే అది ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. కార్యాలయాల్లో అనధికార వ్యక్తుల ప్రమేయాన్ని నియంత్రించడంతో పాటు, దరఖాస్తుదారుడు తన ఫైల్ పరిస్థితిని నేరుగా తెలుసుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రభుత్వ పనికి మధ్యవర్తి అవసరం లేని వ్యవస్థ ఏర్పడాలి. ఇదే సమయంలో భూ రికార్డుల్లో తలెత్తుతున్న తప్పులు కూడా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. పేర్లలో తప్పులు, భూమి విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్లలో గందరగోళం, పాత రికార్డులు--కొత్త రికార్డుల మధ్య వ్యత్యాసాలు వంటి సమస్యలు కొందరిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రికార్డులో తప్పు జరిగితే దాన్ని సరిచేయించుకోవడానికి మళ్లీ దరఖాస్తు చేయాలి, పత్రాలు సమర్పించాలి, అధికారుల పరిశీలన కోసం వేచి ఉండాలి,అవసరమైతే సర్వే చేయించుకోవాలి. ఇలా ఒక చిన్న తప్పును సరిచేయించుకోవడానికి కూడా అనేక దశలు దాటాల్సి రావడంతో సమస్య పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందని బాధితులు వాపోతున్నారు. వ్యవస్థలో తప్పు జరిగితే.. దాన్ని సరిచేసే బాధ్యత కూడా అదే వ్యవస్థపై ఉండాలి కదా.. అనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. మరోవైపు కొందరి దరఖాస్తులు త్వరగా పరిష్కారం అవుతుండగా, మరికొందరి ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. దీనికి సిబ్బంది కొరత కారణమా, పత్రాలు అసంపూర్తిగా ఉన్నాయా, సాంకేతిక సమస్యా, విచారణ అవసరమా, లేక పరిపాలనా జాప్యమా అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. ప్రభావం ఉన్నవారికి ఒక విధానం.. సామాన్యుడికి మరో విధానం అనే భావన ప్రజల్లో ఏర్పడకుండా ప్రతి దరఖాస్తును ఒకే నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇవ్వడం, ఫైల్ ప్రస్తుతం ఏ అధికారి వద్ద ఉందో, ఏ దశలో ఉందో, ఎందుకు పెండింగ్‌లో ఉందో, ఇంకా ఏ పత్రాలు అవసరమో, ఎప్పటిలోగా పరిష్కరించాల్సి ఉందో దరఖాస్తుదారుడికి స్పష్టంగా తెలియజేసే విధానం ఉండాలి. ప్రజలు ఫైల్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పరిస్థితిని తెలుసుకునేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. అదే సమయంలో ఉన్నతాధికారులు ఏ అధికారి వద్ద ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయో పర్యవేక్షించే అవకాశం కల్పించాలి. అవినీతి లేదా అక్రమ డబ్బు డిమాండ్‌పై ఫిర్యాదు చేయాలంటే సామాన్యుడు భయపడకూడదు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచే విధానం ఉండాలి. ఫిర్యాదు చేసిన కారణంగా అతని పని మరింత ఆలస్యం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. అక్రమ డబ్బు డిమాండ్ చేసినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసి నిజాయితీగా పనిచేసే అధికారులపై అన్యాయం జరగకుండా నిష్పాక్షిక విచారణ జరపాలి. నిజాయితీగా పనిచేసేవారికి రక్షణ.. తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష.. ఇదే ప్రజలు కోరుకుంటున్న పారదర్శక వ్యవస్థ. ప్రభుత్వం రెవిన్యూ సేవలను సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు, డిజిటల్ రికార్డులు, సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే సాంకేతికత పెరిగినా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పూర్తిగా తగ్గకపోతే ఆ డిజిటల్ వ్యవస్థల ప్రయోజనం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత ఫైల్ ఎక్కడ ఆగిపోయింది, సిస్టమ్‌లో తప్పు నమోదైతే దాన్ని ఎవరు సరిచేయాలి, ఎంత సమయంలో సరిచేయాలి, ఆలస్యం జరిగితే బాధ్యత ఎవరిది అనే అంశాలపై స్పష్టమైన జవాబుదారీతనం అవసరం. రెవిన్యూ కార్యాలయంలో ఒక ఫైల్ పెండింగ్‌లో ఉండటం అధికారుల దృష్టిలో ఒక దరఖాస్తు కావచ్చు. కానీ ఆ ఫైల్ వెనుక ఒక రైతు ఉండవచ్చు.. ఒక పేద కుటుంబం ఉండవచ్చు.. వారసత్వ హక్కు కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు ఉండవచ్చు.. బ్యాంకు రుణం కోసం భూమి పత్రాలు అవసరమైన వ్యక్తి ఉండవచ్చు.. కోర్టు వివాదంలో చిక్కుకున్న బాధిత కుటుంబం ఉండవచ్చు. అందుకే రెవిన్యూ వ్యవస్థలో ఆలస్యం అంటే కేవలం పరిపాలనా జాప్యం కాదు.. ఒక కుటుంబ భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం. రెవిన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి, వాటి ఆలస్యానికి కారణాలను నమోదు చేయాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పంపకుండా, సమస్య పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించే విధానం ఉండాలి. భూ రికార్డుల్లో తప్పిదాలు, సర్వే సమస్యలు, మ్యుటేషన్ దరఖాస్తులు, వారసత్వ హక్కుల నమోదు వంటి అంశాల్లో పెండింగ్ వివరాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఈ నేపథ్యంలో రెవిన్యూ కార్యాలయాల్లో ప్రస్తుతం ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి..? ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు ఎన్ని..? వాటి ఆలస్యానికి అసలు కారణం ఏమిటి..? సామాన్యుడి పని నిర్ణీత గడువులో ఎందుకు పూర్తికావడం లేదు..? బాధ్యత ఎవరిది..? అక్రమ డబ్బు డిమాండ్లపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి..? ఆ ఫిర్యాదులపై ఎన్ని విచారణలు జరిగాయి..? ఎన్ని నిజమని తేలాయి..? అవినీతి ఆరోపణలు నిజమని తేలిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? మధ్యవర్తుల పాత్రపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? భూ రికార్డుల్లో పేర్లు, విస్తీర్ణాలు, సర్వే నంబర్లకు సంబంధించిన తప్పులు ఎన్ని గుర్తించారు..? వాటిలో ఎన్ని పరిష్కరించారు..? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి..? ప్రజల ఫిర్యాదులపై బాధ్యులుగా తేలిన అధికారులు, సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? ప్రతి దరఖాస్తు స్థితిని ప్రజలకు తెలియజేసే పారదర్శక వ్యవస్థ పూర్తిస్థాయిలో ఎప్పుడు అమల్లోకి వస్తుంది..? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రజల భూమి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. భూమి రికార్డుల్లో జరిగే చిన్న తప్పు కూడా ఒక కుటుంబాన్ని కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి నెట్టవచ్చు. ఒక మ్యుటేషన్ ఆలస్యం కుటుంబ ఆస్తి హక్కులను ప్రభావితం చేయవచ్చు. ఒక సర్వే ఆలస్యం రైతును తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టవచ్చు. అందువల్ల పారదర్శకత, జవాబుదారీతనం, నిర్ణీత గడువు, అవినీతి రహిత సేవలు రెవిన్యూ వ్యవస్థకు ప్రాథమిక లక్షణాలుగా ఉండాలి. ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉంటే.. ప్రశ్నలు కూడా పెండింగ్‌లో ఉండవు..! అవినీతి ఆరోపణలు వస్తే.. నిజం బయటకు వచ్చే వరకు ప్రశ్నలు ఆగవు..! రెవిన్యూ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులు, భూ రికార్డుల సమస్యలు, సర్వేలు, మ్యుటేషన్లు, వారసత్వ హక్కులు, భూముల వివాదాలు, అక్రమ డబ్బు డిమాండ్లపై వస్తున్న ఆరోపణలు, మధ్యవర్తుల పాత్ర, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వంటి అంశాలపై జై భీమ్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఆరోపణల వెనుక అసలు నిజం ఏమిటి..? ప్రజల ఫిర్యాదుల్లో వాస్తవం ఎంత..? వ్యవస్థలో లోపాలు ఎక్కడ ఉన్నాయి..? బాధ్యత ఎవరిది..? సామాన్యుడికి న్యాయం ఎప్పుడు..? అసలు నిజాలను వెలికితీసే ప్రయత్నం..

**జై భీమ్ సంచలన ప్రత్యేక కథనం.. త్వరలో..!**

# మ్యాపింగ్, లాజికల్ ఎర్రర్ల సవరణకు అవకాశం

**మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలు మున్సిపల్ కార్యాలయంలో నమోదు**
**వయస్సు, తల్లిదండ్రుల వివరాలు, కుటుంబ సభ్యుల మ్యాపింగ్ లోపాలపై ధ్రువీకరణ పత్రాలు బిఎల్ఓలు సేకరణ :మున్సిపల్ కమీషనర్ మల్లేష్**

వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:

వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేస్తున్నామని మున్సిపల్ కమీషనర్ కే. మల్లేష్ తెలిపారు. సోమవారం 13 వ వార్డులో కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ తో కలిసి సందర్శించిన కమీషనర్ మ్యాపింగ్ కాని ఓటర్లు మున్సిపల్ కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఎన్యూమరేషన్ పత్రాల్లో నమోదైన లాజికల్ ఎర్రర్ల సవరణ కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల సంఘం నిర్ధారించిన గడువు లోగా సమర్పించాలని కోరారు. ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటర్లు పేర్కొన్న వివరాల ఆధారంగా తల్లిదండ్రులు--పిల్లల మధ్య వయస్సు తేడా 15 సంవత్సరాల కంటే తక్కువగా లేదా 50 సంవత్సరాల కంటే ఎక్కువగా ఉండటం, ఓటరు-తాత లేదా నానమ్మల మధ్య వయస్సు తేడా 40 సంవత్సరాల కంటే తక్కువగా నమోదవడం వంటి లోపాలు గుర్తించబడ్డాయని, అలాగే ప్రస్తుత ఓటరు జాబితాలోని తండ్రి పేరు, 2002 నాటి ఓటరు జాబితాలోని పేరుతో సరిపోలకపోవడం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా ఉండటం, ఓటరు పేర్లు అలాగే కుటుంబ వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి అంశాలపై విచారణ చేపడుతున్నారని అన్నారు. ఈ లోపాలతో మ్యాపింగ్ అయిన ఓటర్లకు నోటీసులు జారీ చేసి వివరణలు,



ధ్రువీకరణ పత్రాలు బీఎల్ఓలు నుస్రత్ ఫాతిమా, నర్సమ్మ కు సమర్పించాల్సిందిగా తెలిపారు. కౌన్సిలర్ మాట్లాడుతూ 13వ వార్డులోని సిద్ధార్థ స్కూల్ దగ్గర ప్రత్యేకంగా పత్రాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఓటర్లందరూ గడువులోగా తమ పత్రాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వాలే శంకర్, యూసుఫ్దిన్, అంజద్ అలాగే బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# అసైన్మెంట్ రైతులకు బ్యాంకు రుణాల అవకాశం కల్పించాలి

**భూ భారతి పోర్టల్‌లో మోర్టిగేజ్ ఆప్షన్ ఇవ్వాలని రెవెన్యూ మంత్రి పొంగులేటికి వినతి**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని అసైన్మెంట్ భూముల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం కల్పించాలని కోరుతూ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ రాష్ట్ర ప్రతినిధుల బృందం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పుట్టపాగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేసింది. తెలంగాణ రాష్ట్రంలోని అసైన్మెంట్ చట్టం పరిధిలో ఉన్న భూములకు భూ భారతి పోర్టల్‌లో మోర్టిగేజ్ ఆప్షన్‌ను కేటాయించి, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అసైన్మెంట్ భూములు కలిగిన రైతులు వ్యవసాయ అవసరాలు, కుటుంబ అవసరాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో చిన్నచిన్న రుణాలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధుల బృందం మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. గతంలో ధరణి పోర్టల్‌కు ముందు బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు అవకాశం ఉండేదని, అయితే ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన తర్వాత ఆ అవకాశం లేకపోవడంతో అసైన్మెంట్ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధుల బృందం తెలిపింది. అసైన్మెంట్ రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి గారితో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.



సంస్థ డైరెక్టర్ పుట్టపాగ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది అసైన్మెంట్ రైతులు తమ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. రైతులు తమ అవసరాల కోసం బ్యాంకుల నుంచి చట్టబద్ధంగా రుణాలు పొందే అవకాశం కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో అసైన్మెంట్ రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూ భారతి పోర్టల్‌లో అసైన్మెంట్ భూములకు ప్రత్యేక మోర్టిగేజ్ ఆప్షన్‌ను కల్పించి, అర్హత ఉన్న రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ గాలిగళ్ళ సాయిబాబా మాట్లాడుతూ, అసైన్మెంట్ భూముల రైతులకు రుణాల సదుపాయం కల్పించాలనే డిమాండ్‌పై గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. రైతుల ఆర్థిక అవసరాలను, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భూ భారతి పోర్టల్ రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉండేలా అసైన్మెంట్ భూముల అంశంపై కూడా తగిన విధానం రూపొందించాలని కోరారు. అసైన్మెంట్ రైతుల భూములకు బ్యాంకు రుణాల అవకాశం కల్పించాలనే డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశతో ప్రతినిధుల బృందం సచివాలయం నుంచి తిరిగి వెళ్లింది. ఈ కార్యక్రమంలో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్లు పుట్టపాగ శ్రీనివాస్, గాలిగళ్ళ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధి కోసం రూ.156 కోట్ల నిధులు..

**ఖర్చయింది కేవలం రూ.34 కోట్లే..!**
**ఖర్చు చేయని ఎంపీలు ఎందుకు..?**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

తెలంగాణకు చెందిన 11 మంది కాంగ్రెస్ ఎంపీలకు ప్రజల అభివృద్ధి, నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పన కోసం మొత్తం రూ.156.08 కోట్ల ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులు కేటాయించారు. కానీ ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం కేవలం రూ.34.09 కోట్లు మాత్రమే. అంటే మొత్తం నిధుల్లో వినియోగం కేవలం 21.84 శాతానికే పరిమితమైంది. ప్రజల అవసరాల కోసం, అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రజల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు ఇంకా ఎందుకు ఖర్చు కావడం లేదు..? ప్రజలు ఎన్నుకున్న ఎంపీలు ఈ విషయంపై సమాధానం చెప్పాల్సిన అవసరం లేదా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సరైన రోడ్లు లేవు.. తాగునీటి సమస్యలు ఉన్నాయి.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత ఉంది.. ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలు లేవు.. డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల సమస్యలు, కమ్యూనిటీ భవనాల కొరత ఇలా అనేక సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రజల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించిన కోట్లాది రూపాయల ఎంపీ నిధులను ఖర్చు చేయకుండా ఉంచడం ఎందుకు అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎంపీ నిధులు ప్రజల సమస్యలు పరిష్కరించడానికా..? లేక ఖాతాల్లోనే కోట్ల రూపాయలు నిల్వ ఉండడానికా..? అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఎంపీ నిధుల వినియోగంలో బలరాం నాయక్ పోరిక 49.2 శాతంతో ముందున్నారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి 42.6



శాతం, అనిల్ కుమార్ యాదవ్ మండాడి 37 శాతం, మల్లు రవి 32 శాతం నిధులను వినియోగించారు. సురేశ్ కుమార్ షెట్కార్ 19.5 శాతం, కడియం కావ్య 18.5 శాతం, రామసహాయం రఘురామ్ రెడ్డి 14.6 శాతం, వంశీకృష్ణ గడ్డం 11 శాతం, కుందూరు రఘువీర్ 4.8 శాతం, రేణుకా చౌదరి కేవలం 2.1 శాతం నిధులను మాత్రమే వినియోగించారు. ఇక అభిషేక్ మను సింఘ్వీకి రూ.7.34 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు ఖర్చు సున్నాగా నమోదైంది. అత్యధికంగా రూ.16.30 కోట్ల నిధులు కుందూరు రఘువీర్‌కు కేటాయించగా, అందులో కేవలం రూ.77.67 లక్షలు మాత్రమే వినియోగించారు. అంటే కోట్లాది రూపాయల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల అభివృద్ధి కోసం వాటిని వినియోగించడంలో ఎందుకు ఇంత వెనుకబడ్డారన్న ప్రశ్న ప్రజల నుంచి వస్తోంది. వంశీకృష్ణ గడ్డంకు రూ.14.85 కోట్లు కేటాయించగా కేవలం రూ.1.64 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రేణుకా చౌదరి నిధుల వినియోగం 2.1 శాతానికే పరిమితం కాగా, అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన రూ.7.34 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకపోవడం మరింత ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం. అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పుడు వాటిని సకాలంలో ప్రజల అవసరాలకు వినియోగించడం మరింత ముఖ్యమైన బాధ్యత. నిధులు ఉన్నాయి.. సమస్యలు ఉన్నాయి.. ప్రజలు ఎదురుచూస్తున్నారు.. మరి ఖర్చు చేయడంలో ఆలస్యం ఎందుకు..? ప్రజల సమస్యలు ఎంపీలకు కనిపించడం లేదా..? లేక అభివృద్ధి పనులను గుర్తించి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం జరుగుతోందా..? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల సమయంలో అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడం సులభమే. కానీ ప్రజల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు అందుబాటులో ఉన్నప్పుడు వాటిని ఖర్చు చేసి గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు వంటి సమస్యలకు పరిష్కారం చూపించడమే అసలు ప్రజాప్రతినిధి బాధ్యత. రూ.156.08 కోట్ల నిధుల్లో ఇప్పటివరకు కేవలం రూ.34.09 కోట్లు మాత్రమే ఖర్చు కావడం అంటే మిగిలిన కోట్లాది రూపాయలు ప్రజల కోసం ఎప్పుడు వినియోగిస్తారన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.

**జై భీమ్ న్యూస్ ప్రశ్నిస్తోంది..!**


ప్రజల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు ప్రజల కోసమే ఖర్చు చేయాలి. ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేయకుండా ఉంచడం ఎందుకు..? నిధులు వినియోగించని ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే చేరాలి. మాటలు కాదు.. అభివృద్ధి పనులు కనిపించాలి. రూ.156 కోట్ల నిధులు.. వినియోగం కేవలం 21.84 శాతమే..! మిగిలిన కోట్లాది రూపాయలు ప్రజల కోసం ఎప్పుడు ఖర్చవుతాయి..? ఖర్చు చేయని ఎంపీలు ఎందుకు..? ఇదే తెలంగాణ ప్రజలు అడుగుతున్న అసలు ప్రశ్న..!

# హంటర్ రోడ్డులో మీడియన్ కటింగ్ మూసివేత

**విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు తాత్కాలిక ప్రయోగాత్మక చర్యలు**
**వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**

**వరంగల్, 01 సెప్టెంబర్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హన్మకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు కీలక మార్పులు చేపట్టనున్నట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అదాల జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు ఉన్న ప్రాంతంలో అనేక పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హంటర్ రోడ్డులోని సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారిపై వాహనాల రాకపోకలు, విద్యార్థుల ప్రయాణ పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వారు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పరిశీలన అనంతరం న్యూ సైన్స్ కాలేజ్‌కు కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను సెప్టెంబర్ 4వ తేదీ నుంచి తాత్కాలికంగా, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయాలని నిర్ణయించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఈ మార్పు ద్వారా అనవసరమైన యూటర్న్‌లను తగ్గించడంతో పాటు వాహనాల అడ్డదిడ్డమైన రాకపోకలను నియంత్రించి ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మీడియన్ కటింగ్ మూసివేత నేపథ్యంలో వాహనదారులు కొత్త ట్రాఫిక్ మార్పును గమనించి తమ ప్రయాణ మార్గాలను ముందుగానే నిర్ధారించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి వాహనదారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా




వ్యవహరించాలని, వేగాన్ని నియంత్రించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణంతో పాటు ప్రజల రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకునే ఈ చర్యలను చేపడుతున్నట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. తాత్కాలికంగా ప్రయోగాత్మక ప్రాతిపదికన అమలు చేయనున్న మీడియన్ కటింగ్ మూసివేత అనంతరం ట్రాఫిక్ పరిస్థితులను అధికారులు పరిశీలించనున్నారు. పరిస్థితుల ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# రాహుల్ గాంధీపై కేసా.. ప్రశ్నిస్తే ప్రతి ఒక్కరిపైనా కేసులు పెడతారా?

**దళితులను అవమానించిన వారిని వదిలి.. ప్రశ్నించిన రాహుల్‌పై కేసు పెట్టడం ఏంటి?**
**తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**





**హైదరాబాద్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోకుండా, ఆ ఘటనను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గంగాజలంతో శుద్ధి చేశారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఒక దళితుడు కూర్చున్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం కుల వివక్షకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ధైర్యంగా ప్రశ్నించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని, అయితే ఆయనపైనే కేసు నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని స్వర్ణ ఆరోపించారు. "దళితుడిని అవమానించిన వారిపై చర్యలు తీసుకోకుండా.. దాన్ని ప్రశ్నించిన నాయకుడిపై కేసు పెట్టడం ఏంటి? ఇదేనా ప్రజాస్వామ్యం?" అని ఆమె ప్రశ్నించారు.

**'ఈరోజు రాహుల్.. రేపు మనమంతా'**

రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం ద్వారా ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తున్నారని స్వర్ణ అన్నారు. "ఈరోజు రాహుల్ గాంధీపై కేసు.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై కేసు పెట్టే పరిస్థితి వస్తుంది. కానీ మేము భయపడము. 'భయపడకు' అనే రాహుల్ గాంధీ పిలుపుతో ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాం" అని స్పష్టం చేశారు. కులగణన, మహిళలకు రిజర్వేషన్లు, దేశ సంపద, అదానీ వ్యవహారం వంటి అంశాలపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ, దళితుల ఆత్మగౌరవం, మహిళల హక్కుల కోసం మహిళా కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

**పోలీసులు అడ్డుకున్నా.. నిరసన ఆగలేదు**

అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు గాంధీ భవన్ నుంచి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో గాంధీ భవన్ ఎదుటే మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన చేపట్టారు. హల్ద్వానీ ఘటనకు బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎర్రబెల్లి స్వర్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశ్రమలకు తగ్గట్టుగా కేయూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**కేయూ-వేదా ఎడ్యుకేషనల్ సొసైటీ-ప్రముఖ పరిశ్రమలతో అవగాహన ఒప్పందం**

**హనుమకొండ, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కాకతీయ విశ్వవిద్యాలయం కీలక ముందడుగు వేసింది. కేయూ, హైదరాబాద్‌కు చెందిన వేదా ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రాజ్ఞ సెమీకండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అటల్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా వీఎల్ఎస్ఐ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు 'ఇండస్ట్రీ రెడీ ప్రొఫెషనల్ ట్రైనింగ్' అందించనున్నారు. కేయూ ఇంజనీరింగ్ కాలేజ్, కేయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజ్, కిట్స్ వరంగల్ విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులు. కనీసం 7.5 సీజీపీఏ లేదా 70 శాతం మార్కులు సాధించి, బ్యాక్‌లాగ్‌లు లేని విద్యార్థులను రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. శిక్షణలో సాధించిన క్రెడిట్లను విద్యార్థుల డిగ్రీల్లో కేయూ గుర్తించనుంది. శిక్షణ పూర్తి చేసిన ప్రతిభావంతులకు భాగస్వామ్య పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేయడంతో పాటు, విద్యా సంస్థలు--పరిశ్రమల మధ్య ఉన్న నైపుణ్య అంతరాన్ని తగ్గించడమే ఈ భాగస్వామ్య లక్ష్యమన్నారు. ఐదు సంవత్సరాల పాటు ఈ అవగాహన ఒప్పందం అమల్లో ఉండనుంది. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, రుసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జునరెడ్డి, కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ఆచార్య కే. అశోక్‌రెడ్డి, వేదా ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కె. సుబ్బరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# పెన్షన్ మా హక్కు.. దయ కాదు!

**సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి**

**కేయూలో ఉద్యోగ సంఘాల నిరసన.. ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక**




**కేయూ క్యాంపస్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

"పెన్షన్ మా హక్కు.. దయ కాదు" అంటూ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీజీజాక్, టీయూఎన్‌టీఈఏ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఆకు ట్, కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్‌జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన నిర్వహించారు. కేయూ ఎన్‌జీవోస్ అధ్యక్షుడు బూరా నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆకు ట్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎల్.పి. రాజ్‌కుమార్, కేయూ ఎన్‌జీవోస్ ప్రధాన కార్యదర్శి వల్లాల తిరుపతి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బొక్క మొగిలి, కేయూ సీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటి దామోదర్ మాట్లాడారు.

**33 ఏళ్ల సేవకు పెన్షన్ భద్రత లేదా?**


దాదాపు 33 ఏళ్ల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత పెన్షన్ భద్రత లేకుండా జీవించాల్సి రావడం అన్యాయమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేది పాత పెన్షన్ విధానమేనని పేర్కొన్నారు. రానున్న శాసనసభ సమావేశాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఉద్యోగులకు చేసే దయ కాదని, దీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు లభించాల్సిన హక్కు అని స్పష్టం చేశారు.


**ఉద్యమం కొనసాగిస్తాం**

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేట్ రంగంలో విజయానికి మర్యాదలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు కీలకం

**విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: డాక్టర్ రాజేష్ పెర్వేడ్**




**వరంగల్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కార్పొరేట్ రంగంలో విజయాన్ని సాధించాలంటే వృత్తిపరమైన మర్యాదలు, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతో కీలకమని టి-హబ్ ప్రతినిధి డాక్టర్ రాజేష్ పెర్వేడ్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న నేతృత్వంలో, రుసా 2.0 సహకారంతో ఎంపిక చేసిన విద్యార్థులకు నిర్వహిస్తున్న నాలుగో వ్యవస్థాపకత నైపుణ్యాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రాజేష్ పెర్వేడ్ "కార్పొరేట్ మర్యాదలు" అంశంపై శిక్షణ ఇచ్చారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో పాటు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దంలో కార్పొరేట్ సంస్థలు ఉద్యోగుల నుంచి ఆశిస్తున్న నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన, చురుకైన వినికిడి వంటి నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సంస్థల్లో ఉద్యోగుల ప్రవర్తన, వృత్తిపరమైన మర్యాదలు, ఇతరులతో వ్యవహరించే విధానం వంటి అంశాలను ప్రయోగాత్మక ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, సృజనాత్మక ఆలోచన, వినికిడి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే పద్ధతులను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

**10 అంకుర సంస్థల స్థాపనే లక్ష్యం**

కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 1,700 మంది విద్యార్థులను ప్రాథమిక ఎంపిక ప్రక్రియలో భాగస్వాములను చేసినట్లు తెలిపారు. వారిలో 400 మంది విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 17 శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన 100 మంది విద్యార్థులతో వివిధ బృందాలను ఏర్పాటు చేసి, వారికి ఉన్నత స్థాయి శిక్షణ అందించడం ద్వారా 10 అంకుర సంస్థలను స్థాపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రుసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా తదుపరి రోజు కూడా మరో అంశంపై నిపుణులతో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే-హబ్ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ బొల్లం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**



**పరకాల, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పరకాల శాసనసభ్యులు, అభివృద్ధి ప్రదాత రేవూరి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు పరకాలలో ఘనంగా నిర్వహించారు. 1వ వార్డు పరిధిలోని కొత్తకాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో వార్డు ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, సమన్వయ కమిటీ సభ్యుడు మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజలతో మమేకమై నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొచ్చు అంజి, బొచ్చు కిషన్, బొచ్చు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల ఐక్యతే పార్టీకి బలం

**2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం ఎంపీ కడియం కావ్య**




**జఫర్‌గఢ్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ఐక్యంగా, క్రమశిక్షణతో పనిచేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడంతో పాటు తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని జఫర్‌గఢ్ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం, నూతన గ్రామ కమిటీల పరిచయ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. కాంగ్రెస్ కార్యకర్తల పదేళ్ల కష్టానికి ఫలితంగానే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని కావ్య అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,400 కోట్ల నిధులతో వివిధ పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని చెప్పారు. కొత్త, పాత నాయకులు, కార్యకర్తల సమన్వయంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపడిందని, చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామ కమిటీలు పార్టీకి పునాదులని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత పెంచి, గ్రామ కమిటీల్లో వారికి నాయకత్వ అవకాశాలు కల్పించాలని కోరారు.

**రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం**

రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని కడియం కావ్య అన్నారు. దేశ భవిష్యత్తు, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలు ఐక్యంగా, క్రమశిక్షణతో సైనికుల్లా పనిచేస్తే తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వం బలోపేతం కావడం ఖాయమని ఆమె స్పష్టం చేశారు.

## ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్**

అమరావతి,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు.

## కేయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో ఘనంగా వీడ్కోలు





**కేయూ క్యాంపస్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో 2025--2026 బ్యాచ్ ఎం.ఎల్.ఐ.సీ. విద్యార్థులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు జరిగిన కార్యక్రమానికి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రాధికారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధికారాణి మాట్లాడుతూ విభాగం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, విద్యార్థులు సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ వారిని అభినందించారు. ముఖ్య అతిథి డాక్టర్ రమ కెరీర్ గైడెన్స్, క్రమశిక్షణ, ఉద్యోగ ధర్మం, భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే విధానాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. విభాగ సీనియర్ పూర్వ విద్యార్థి డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్ మాట్లాడుతూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిణామాలు, జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఏఐ టూల్స్‌పై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అధ్యాపకులు కిశోర్, రవిచంద్ర, రాజు, కవిత తదితరులు రాబోయే వార్షిక పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యే విధానాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు అఖిల, శ్రీకీర్తన, జ్యోతి, విద్యార్థులు బద్రి, అభిషేక్, వీరన్నతో పాటు ఇతర విద్యార్థులు, ఆఫీస్ ఇన్‌చార్జి రవి, విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' నిధుల విడుదలకు సిద్ధం

**సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం**

**మొదటి సంవత్సరం విద్యార్థులకు అందజేత**

అమరావతి,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది. వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఫేక్ సర్టిఫికెట్ల కేసులో ఉద్యోగం కోల్పోయిన వ్యక్తికి మళ్లీ పోస్టింగ్?

**వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ నియామకంపై తీవ్ర ఆరోపణలు**




**హన్మకొండ, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నక్కలగుట్ట సర్కిల్--3లో ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌గా ఓ వ్యక్తి నియామకంపై మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిలో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొని, ఉద్యోగం కోల్పోయి, పోలీస్ కేసును ఎదుర్కొన్న వ్యక్తికి తిరిగి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఎలా లభించిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**గతంలోనే చర్యలు , ఇప్పుడు మళ్లీ ఉద్యోగం?**

సదరు వ్యక్తి గతంలో మెడికల్ ఇన్వాలిడేషన్ కోటా ద్వారా మున్సిపల్ శాఖలో ఉద్యోగం పొందినట్లు సమాచారం. అనంతరం అధికారులు నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనలో ఆయన సమర్పించిన సర్టిఫికెట్లపై అనుమానాలు వ్యక్తమై, సంబంధిత శాఖల వెరిఫికేషన్‌లో అవి చెల్లుబాటు కావని తేలినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని అప్పటి మున్సిపల్ కమిషనర్ వి.పి. గౌతమ్ తీవ్రంగా పరిగణించి, మట్టవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించి ఉద్యోగం నుంచి తొలగించినట్లు సమాచారం.

**మరి ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ పోస్టింగ్ ఎలా?**

ఇంతటి వివాదంలో చిక్కుకున్న వ్యక్తికి తిరిగి అదే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌గా అవకాశం కల్పించడంపై ఉద్యోగ వర్గాల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించారా? ఉన్నతాధికారుల అనుమతులు తీసుకున్నారా? గత కేసు, ఉద్యోగ తొలగింపు వివరాలను పరిశీలించారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా, గతంలో రిక్రూట్‌మెంట్ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన ఓ సూపరింటెండెంట్ సదరు వ్యక్తికి బంధువు కావడంతోనే తిరిగి పోస్టింగ్ లభించిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**ఆర్డర్లు లేకుండానే పోస్టింగులా?**

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలు, పోస్టింగుల విషయంలో అధికారిక ఉత్తర్వులు, నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణలు కూడా తాజాగా తెరపైకి వచ్చాయి. పలువురికి ఇదే తరహాలో పోస్టింగులు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది.

**విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విచారణకు డిమాండ్**

ఈ వ్యవహారంపై కేవలం అంతర్గతంగా కాకుండా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్ విభాగాలు సమగ్రంగా విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. సంబంధిత అధికారి హయాంలో జరిగిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు, పోస్టింగులు, బదిలీలు, అధికారిక ఉత్తర్వులు, అభ్యర్థుల అర్హతలు, ఎంపిక ప్రక్రియను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని, నియామక ప్రక్రియను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆరోపణలు నిజమా? నిబంధనల ప్రకారమే నియామకం జరిగిందా? అన్నది అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

# 420 హామీలను అమలు చేయాలి- లేకుంటే ప్రజా ఉద్యమం

**సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు : బీఆర్ఎస్ నేతలు**

**బాలసముద్రం, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు 420 హామీల అమలును డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. బాలసముద్రంలోని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు. వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల పక్షాన శాంతియుతంగా నిరసనలు, ధర్నాలు నిర్వహించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు అనేక అదనపు పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతంలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారంటూ అధికార పార్టీపై ఆరోపణలు చేశారు. కాజీపేట వైఎస్సార్ నగర్‌లో గుడిసెల తొలగింపు అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. మైనారిటీల షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని తీసుకున్నారని ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న సమయంలో తనను అక్రమంగా అరెస్టు చేయించారని అన్నారు.




చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ రంగంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. పరకాల నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అక్రమ వసూళ్ల ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ దీనిపై ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పాలనపై దృష్టి పెట్టకుండా రాజకీయ పంచాయతీలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న సిబ్బంది జీతాలను తగ్గించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సరికాదని, ప్రభుత్వానికి దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లినప్పటికీ తెలంగాణకు ఏం తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# బాలల సంరక్షణ కేంద్రాల్లో కనీస ప్రమాణాలు తప్పనిసరి

**నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు: ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి**

**హన్మకొండ, 1 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**



బాలల రక్షణ, సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ బాలల సంరక్షణ కేంద్రాలు నిబంధనల ప్రకారం కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ (బాలల సంరక్షణ కేంద్రాలు)ను జిల్లా తనిఖీ కమిటీ (డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ) బృందంతో కలిసి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి తనిఖీ చేశారు. సాయి సేవా ట్రస్ట్, ఒయాసిస్ ట్రస్ట్, మల్లికాంబా మనో వికాస బాలురు, బాలికల కేంద్రం, రీచ్, కేర్ అండ్ షెల్టర్ ప్రత్యేక దత్తత కేంద్రం (శిశు గృహ)లను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కేంద్రాల్లోని డార్మెటరీలు, వాష్‌రూమ్‌లు, డైనింగ్ హాళ్లు, కిచెన్, స్టోర్ రూమ్‌లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ.. బాలల సంరక్షణ కేంద్రాలు సంబంధిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా భవనాలకు సంబంధించిన సౌండ్నెస్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శానిటేషన్, తాగునీటి శుద్ధి, వంటగది, ఆహార పదార్థాల నిల్వ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. లైసెన్స్ కలిగి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న సంస్థలు కూడా కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై సంబంధిత చట్టాలు, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సిహెచ్. అవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్, డాక్టర్ పరికి సుధాకర్, ఇన్‌చార్జి డిసిపీఓ ఎస్. ప్రవీణ్ కుమార్, జిల్లా తనిఖీ బృందం సభ్యులు సిస్టర్ జెస్సీ సిరియాక్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ నూతన మండల కమిటీ ఎన్నిక

**మాదిగల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి నాయకుల పిలుపు**



**తొర్రూరు, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్ )**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తొర్రూరు మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జులు జన్ను దినేష్ మాదిగ, ఏకు శంకర్ మాదిగ ఆధ్వర్యంలో, మండల ఇన్‌చార్జులు ఇస్సాంపల్లి సాయి, సోమరపు లింగన్న మాదిగ సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ తొర్రూరు మండల అధ్యక్షుడిగా పోలేపల్లి గ్రామానికి చెందిన పందుల విజయ్, అధికార ప్రతినిధిగా గూడెల్లి మధు మాదిగ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా నకరికంటి ఆంజనేయులు, అధికార ప్రతినిధిగా సంకినేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు బచ్చలి వెంకన్న, మంద యాకమల్లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు కౌటిల్‌రెడ్డికి ఆహ్వానం



**హన్మకొండ , 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 61వ డివిజన్‌కు చెందిన నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని డీసీసీ జనరల్ సెక్రటరీ--హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కౌటిల్‌రెడ్డిని సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువజన సంఘం ప్రతినిధులు కౌటిల్‌రెడ్డిని కలిసి జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. యువత ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నవచైతన్య యువజన సంఘం సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# చట్టబద్ధమైన దత్తతే శ్రేయస్కరం

**కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ, 01 సెప్టెంబర్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



మాతృత్వం ఒక గొప్ప వరమని, పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా చట్టబద్ధమైన మార్గాన్ని అనుసరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టవిరుద్ధమని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆమె సూచించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (సిఎఆర్ఎ) నియమ నిబంధనల ప్రకారం ఎంపికైన ఇద్దరు శిశువులను సీనియారిటీ ఆధారంగా పూణే, పెద్దపల్లి జిల్లాలకు చెందిన దంపతులకు దత్తతగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిర్దేశించిన విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా దత్తత తీసుకోవడం వల్ల శిశువుల భవిష్యత్తుకు రక్షణ కలుగుతుందని, దత్తత తీసుకునే దంపతులకు కూడా చట్టపరమైన భద్రత ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల సంక్షేమం, హక్కులు, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే దత్తత ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్రమ దత్తతకు పాల్పడటం ద్వారా పిల్లల హక్కులకు భంగం కలిగే అవకాశం ఉందని, అలాంటి వ్యవహారాల్లో చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. శిశువుల దత్తత విషయంలో ఎవరైనా మధ్యవర్తుల మాటలు నమ్మకుండా అధికారిక మార్గాలను మాత్రమే ఆశ్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్. అవంతి, ఇన్‌చార్జి డీసీపీవో ఎస్. ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి

**ఎఫ్ఎల్ఎన్, డిజిటల్ విద్యా కార్యక్రమాలు, తరగతి గది బోధనపై సమీక్ష**





**హన్మకొండ, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న వివిధ విద్యా కార్యక్రమాల తీరును పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి మంగళవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, తరగతి గది బోధన, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రాక్టీసింగ్ మరియు లష్కర్‌బజార్ పాఠశాలలను సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి ప్రాథమిక స్థాయిలో అమలు చేస్తున్న పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులను సమీక్షించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా రుచి చూసి పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు భోజనం అందిస్తున్న విధానం, పాఠశాలలో పాటిస్తున్న పారిశుధ్య ప్రమాణాలపై వివరాలు తెలుసుకున్నారు. తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాక్టీసింగ్ మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూలైవాడను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న డిజిటల్ విద్యా కార్యక్రమాలు, డిజిటల్ బోధనా విధానాలు మరియు తరగతి గది బోధన--అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థులు డిజిటల్ విద్యా కార్యక్రమాల్లో ఏ మేరకు భాగస్వామ్యం అవుతున్నారు, ఉపాధ్యాయులు డిజిటల్ సాధనాలను ఏ విధంగా వినియోగిస్తున్నారు అనే అంశాలను పరిశీలించి, విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న అన్ని విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించాలని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అవసరమైన చదవడం, రాయడం, సంఖ్యాజ్ఞాన నైపుణ్యాలను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక డిజిటల్ విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ, సమీక్ష అవసరమని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి తగిన బోధనా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పాఠశాలల సందర్శన కార్యక్రమంలో ఏఎంఓ డాక్టర్ బండారు మన్మోహన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ బి. మహేష్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి బి ఆర్ ఎస్ పోరుబాట


**పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాక సమావేశంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

పరిగి నియోజకవర్గంలో ప్రజల పక్షాన పోరుకు సిద్ధంగా ఉన్నానని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు సెప్టెంబర్ 2 తారీకు నుండి, వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను 6 గ్యారంటీల, 420 హామీల వైఫల్యాన్ని నిరసిస్తూ, రేపటి నుంచి పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా జరగబోయే నిరసన కార్యక్రమలపైన, నేడు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తూ, బీ ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు, మాజీ ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో విసిగిపోయారు అని, కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం





**డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దు: ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు**
**స్మార్ట్ రేషన్ కార్డుతో అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలు: ఎంపీ డా. కడియం కావ్య**

**హసన్ పర్తి, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్టలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రజలకు రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడిసెలు లేని గ్రామాలను చూడాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్ల కోసం ప్రజలు ఎదురుచూశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం తదితర సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ పొందేందుకు మాత్రమే కాకుండా అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. 'వన్ కార్డు--మెనీ స్కీమ్స్' విధానంలో ఆరోగ్య సేవలు, రుణాలు, సన్నబియ్యం, విద్యుతో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన కుటుంబాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు స్మార్ట్ రేషన్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు ఎంపీ పిలుపునిచ్చారు. చిన్నారులకు ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డు ఇచ్చినట్లే, ప్రభుత్వం 1000 రోజుల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పేదలకు ఇళ్ల మంజూరు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగినా, మోసాలకు పాల్పడినా వెంటనే ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు దృష్టికి తీసుకురావాలని ఎంపీ సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇళ్ల మంజూరు విషయంలో అక్రమ వసూళ్లకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వర్ధన్నపేట ఎస్సీ నియోజకవర్గం కావడంతో పేద కుటుంబాలు అధికంగా ఉన్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని డా. కడియం కావ్య పేర్కొన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులకే పేదల సమస్యలు, కష్టాలు మరింతగా అర్థమవుతాయని అన్నారు. ఎమ్మెల్యే ప్రతి సమీక్ష సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరవుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

**అధికారిక మార్గాల్లోనే దరఖాస్తులు**

ఎంపీడీఓ సుమనవాణి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పథకాల ప్రయోజనాలు అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో లబ్ధిదారులు అధికారిక సమాచారం ఆధారంగానే ముందుకు వెళ్లాలని, అనధికార వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ సేవలు పొందేందుకు అధికారిక మార్గాలను మాత్రమే అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ రాకేష్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, సీతానాగారం సర్పంచ్ సునీత, అశ్వరావుపల్లి సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, సిద్ధాపూర్ సర్పంచ్ హరీష్, బైరాన్‌పల్లి సర్పంచ్ సురేందర్, కొత్తపల్లి సర్పంచ్ సాంబయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్, 1వ డివిజన్ అధ్యక్షుడు చిత్ర రాము, 2వ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, 55వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం అరుణ్, 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకటరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

**ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం..**
**వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు**
**బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజినికుమార్**



**హసన్‌పర్తి, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు బండి రజినికుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా వారం రోజుల పాటు విస్తృత నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించి, ఈ సందర్భంగా పార్టీ చేపట్టనున్న కార్యక్రమాల కార్యాచరణను వెల్లడించారు. సెప్టెంబర్ 2న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై 'చార్జ్‌షీట్' విడుదల చేసి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3న రైతాంగ సమస్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా రైతు సదస్సులు, సెప్టెంబర్ 5న నిరుద్యోగులు, యువత సమస్యలపై యువజన ర్యాలీలు, సెప్టెంబర్ 6న కార్మికుల సమస్యలపై సింగరేణి మైన్స్ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు మరోసారి గుర్తుచేసేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పేరుతో ప్రత్యేక కరపత్రాలను రూపొందించినట్లు బండి రజినికుమార్ తెలిపారు. వీటిని నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేసి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో అందడం లేదని విమర్శించిన ఆయన, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీపై ప్రజలకు సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజాపోరాటం కొనసాగుతుందని బండి రజినికుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తాజా మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ సుభాష్‌గౌడ్, 66వ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, అటికం రవీందర్‌గౌడ్, జక్కుల రమేష్, విక్టరీ బాబు, మైకేల్ రాజు, నంది శ్రీనివాస్, వల్లాల శ్రీకాంత్, ఇమ్మడి రాజేందర్, గుంజే సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు: బండి సంజయ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

# “నేను రాను బిడ్డో.. సర్కారు దావఖానాకు!”

**పేరుకే పెద్దాసుపత్రి.. పేదలకు మాత్రం ప్రాణాలపై భయం!**
**ఎంజీఎం ఎమర్జెన్సీలో కనీస వసతుల కరువు..**
**డ్యూటీ డాక్టర్లపై రోగుల బంధువుల ఆరోపణలు**
**ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు రోగులు.. ఫ్యాన్లు లేక ఇంటి నుంచే తెచ్చుకుంటున్న పేషెంట్లు**
**రాత్రివేళ అత్యవసర వైద్యం ఎలా? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

**వరంగల్, 1 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

“నేను రాను బిడ్డో.. సర్కారు దావఖానాకు!” అనే పాటలోని మాటలు ఇప్పుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే కొందరు పేద రోగుల నోట వినిపిస్తున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలవాల్సిన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి.. కనీస సౌకర్యాల కొరత, నిర్వహణ లోపాలు, అత్యవసర వైద్య సేవలపై వస్తున్న ఆరోపణలతో చర్చనీయాంశంగా మారుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గేటు తొక్కే రోగికి.. ముందుగా కనిపించాల్సింది వైద్య భరోసా. కానీ ఎంజీఎం ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ విభాగాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎమర్జెన్సీలో డాక్టర్ కోసం ఎదురుచూపులా?

క్యాజువాలిటీకి అత్యవసరంగా రోగిని తీసుకొచ్చిన సమయంలో డ్యూటీ డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉండటం లేదని కొందరు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. వైద్యుల కోసం ఎదురు చూస్తూ రోగి బంధువులే ఆందోళన చెందాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అత్యవసర విభాగంలో వైద్యుల అందుబాటు, పర్యవేక్షణపై మరింత శ్రద్ధ అవసరమని రోగుల బంధువులు కోరుతున్నారు. జూనియర్ డాక్టర్లతో పాటు సీనియర్ వైద్యులు కూడా అందుబాటులో ఉండి అవసరమైన సమయంలో వారికి మార్గదర్శకత్వం, సహాయ సహకారాలు అందిస్తే రోగులకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుందని వారు అంటున్నారు. కొంతమంది డ్యూటీ సిబ్బంది విధి సమయంలో సెల్‌ఫోన్లతో నిమగ్నమై ఉంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో ఆసుపత్రి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి తేల్చాల్సిన అవసరం ఉంది.

### ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు రోగులు.. ఇదేనా అత్యవసర వైద్యం?

ఎమర్జెన్సీ విభాగంలో సరిపడా స్ట్రెచర్లు, బెడ్లు లేక ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు రోగులను పడుకోబెడుతున్న పరిస్థితులు ఉన్నాయని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రాణాలను కాపాడేందుకు ఆసుపత్రికి వచ్చిన రోగి.. మరోవైపు కనీస వసతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంటే ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం ఎలా పెరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఫ్యాన్లు లేవు.. ఇంటి నుంచే తెచ్చుకుంటున్న పేషెంట్లు!

ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులకు కనీస సౌకర్యాలు అందడం లేదని పలువురు బంధువులు చెబుతున్నారు. కొన్ని వార్డుల్లో ఫ్యాన్లు అందుబాటులో లేకపోవడంతో ఇంటి నుంచి ఫ్యాన్లు తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. రోగికి వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలో.. గాలి కోసం కూడా ఇంటి నుంచి సామగ్రి తెచ్చుకోవాల్సి వస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వారు అంటున్నారు.

### బాత్రూమ్‌లోకి వెళ్లాలంటేనే భయం!

ఏఎంసీ, ఐసీయూ తదితర ప్రాంతాల్లోని బాత్రూమ్‌ల నిర్వహణపై కూడా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన శుభ్రత లేకపోవడంతో వాటిని ఉపయోగించడానికి రోగులు, బంధువులు ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు పారిశుద్ధ్యం కూడా అంతే ముఖ్యమని.. అధికారులు ప్రతిరోజూ శానిటేషన్ పరిస్థితులను తనిఖీ చేయాలని కోరుతున్నారు.

### రోగుల భోజనంలోనూ కోతల ఆరోపణలు

రోగులకు అందించాల్సిన ఆహారంలో నిర్దేశిత మెనూ, పరిమాణం పాటించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవ్వాల్సిన దానికంటే తక్కువ పరిమాణంలో భోజనం అందిస్తున్నారని కొందరు రోగుల బంధువులు చెబుతున్నారు. పేద రోగులకు అందే ఉచిత వైద్యంలో ఆహారం కూడా కీలక భాగమే. కాబట్టి భోజనం నాణ్యత, పరిమాణం, మెనూపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

### టెస్టుల పేరుతో ప్రైవేట్ సెంటర్లకు పంపుతున్నారా?

ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలను కూడా బయట ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో చేయించుకోవాలని కొందరు సిబ్బంది సూచిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే పేద రోగులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా.. ప్రభుత్వ ఆసుపత్రిపై ఉన్న నమ్మకానికి కూడా భంగం కలుగుతుంది. అందువల్ల ఈ ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరపాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

### దూర ప్రాంతాల నుంచి వస్తే.. రాత్రి ఎక్కడ పడుకోవాలి?

ఉత్తర తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి పేద ప్రజలు ఎంజీఎంను ఆశ్రయిస్తుంటారు. రోగితో పాటు వచ్చే బంధువులకు రాత్రివేళ విశ్రాంతి తీసుకునేందుకు కూడా సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ఆసుపత్రి అంటే కేవలం భవనం కాదు.. రోగికి, అతని కుటుంబానికి భరోసా ఇచ్చే వ్యవస్థ. కానీ భరోసా కోసం వచ్చిన ప్రజలకు అసౌకర్యాలు, నిర్లక్ష్యం, అనిశ్చితి ఎదురైతే.. వారు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న తలెత్తుతోంది.

### చావును అరచేతిలో పెట్టుకుని రావాలా?

“ఎంజీఎంకు రావాలంటే చావును అరచేతిలో పెట్టుకుని రావాల్సిందేనా?” అంటూ కొందరు రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం ఒక ఆసుపత్రి సమస్యగా చూడాల్సిన విషయం కాదు. పేదవాడికి చివరి ఆశ్రయం ప్రభుత్వ ఆసుపత్రి. ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చు భరించలేని కుటుంబాలు ఎంజీఎంనే ఆశ్రయిస్తాయి. అలాంటి ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కూడా అందకపోతే వారు ఎక్కడికి వెళ్లాలి?

### ప్రశ్నలు ఎన్నో.. సమాధానం చెప్పేది ఎవరు?

– ఎమర్జెన్సీలో సరిపడా బెడ్లు, స్ట్రెచర్లు ఎందుకు లేవు?

– ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు రోగులను పడుకోబెట్టే పరిస్థితి ఎందుకు?

– కొన్ని వార్డుల్లో ఫ్యాన్ల నిర్వహణ ఎందుకు సరిగా లేదు?

– రాత్రివేళ డ్యూటీ వైద్యుల అందుబాటుపై ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయి?

– బాత్రూమ్‌లు ఎందుకు శుభ్రంగా నిర్వహించబడటం లేదు?

– రోగుల భోజనంలో మెనూ, పరిమాణంపై ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి?

– ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న పరీక్షలకు ప్రైవేట్ సెంటర్లకు రెఫర్ చేస్తున్నారనే ఆరోపణల్లో నిజమెంత?

– ఆసుపత్రి నిర్వహణను పర్యవేక్షించే అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారా?

ఇది ఎంజీఎం సమస్య మాత్రమే కాదు.. పేదల ఆరోగ్య హక్కు సమస్య!

ఎంజీఎం ఉత్తర తెలంగాణకు ప్రధాన ప్రభుత్వ వైద్య కేంద్రం. ఇక్కడికి వచ్చే ప్రతి రోగి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. వారి ఆశ, నమ్మకం, ఆర్థిక పరిస్థితి అన్నీ ప్రభుత్వ వైద్య వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే ఆరోపణలు నిజమా కాదా అన్నది పక్కనపెట్టి.. ప్రతి అంశంపై క్షేత్రస్థాయి విచారణ జరపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆసుపత్రిలో రాత్రివేళ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. డ్యూటీ రోస్టర్, వైద్యుల హాజరు, బెడ్లు--స్ట్రెచర్ల లభ్యత, ఫ్యాన్లు, ఆక్సిజన్ సౌకర్యాలు, పారిశుద్ధ్యం, రోగుల ఆహారం, డయాగ్నస్టిక్ రెఫరల్స్ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. నిర్లక్ష్యం లేదా అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎంజీఎం భవనం పెద్దదిగా ఉండటం కాదు.. అందులో పేదవాడికి అందే వైద్యం పెద్దదిగా ఉండాలి! “నేను రాను బిడ్డో.. సర్కారు దావఖానాకు” అనే మాట పాటలోనే ఉండాలి.. ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితులను చూసి ప్రజల నోట ఆ మాట రావద్దు! ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎంజీఎం ఆసుపత్రిలోని పరిస్థితులపై సమగ్ర తనిఖీ నిర్వహించి, లోపాలను సరిదిద్ది.. ఉత్తర తెలంగాణ ప్రజలకు నమ్మకమైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.




# ప్రైవేటు పరం కానున్న సింగరేణి..!

**ప్రైవేటుకు అప్పగించేందుకు సన్నాహాలు**
**భారీ నష్టాల్లో భూగర్భ బొగ్గు గనులు**

**హైదరాబాద్,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్):**

కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు భారీ నష్టాల్లో ఉన్న భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుకు అప్పగించేందుకు సింగరేణి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు పరిశీలన చేస్తోంది. జాతీయ సంస్థలైన కోల్ ఇండియా, వెస్ట్రన్స్ కోల్‌ఫీల్డ్స్‌లలో ఈ విధానం అమలుతో నష్టాలు తగ్గించుకున్న నేపథ్యంలో అదే బాటలో సింగరేణి సైతం వెళ్లాలని భావిస్తోంది. ముందుగా ప్రయోగాత్మకంగా మందమర్రి ప్రాంతంలోని శాంతి ఖని భూగర్భ గనిని అప్పగించేందుకు ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా ఒక కంపెనీ ముందుకొచ్చింది. దీంతో సింగరేణి సంస్థ త్వరలో టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తోంది. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థకు ఇస్తే.. అది సొంత ఖర్చుతో బొగ్గు తవ్వి సింగరేణికి నిర్ణీత ధరకు అప్పగిస్తుంది. ఆ తర్వాత దాన్ని మార్కెట్‌లో సింగరేణి అమ్ముకుంటుంది. ప్రస్తుతం శాంతిఖని గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి సింగరేణికి రూ.21,558 ఖర్చవుతుంది. వెలికితీసిన బొగ్గును కేవలం రూ.4,167కే విక్రయిస్తున్నందున సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఎండీవో విధానంలో అప్పగించి ఈ నష్టాన్ని తగ్గించాలనేది సింగరేణి సంస్థ యోచన. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం భారీగా పెరగడం.. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ప్రస్తుతం తీవ్ర ప్రభావం చూపుతోంది. యూజీ గనుల్లో ఉద్యోగుల జీతాలు.. స్థిర, చర వ్యయం కలిపి టన్ను బొగ్గు ఉత్పత్తికి, మార్కెట్లో విక్రయధరకు మధ్య అసలు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. 2025 చివరి నాటికి మొత్తం 22 భూగర్భ గనులకుగాను 21 నష్టాల్లో ఉన్నట్లు ఈ సంస్థ కేంద్రానికి ఇచ్చిన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ 21 గనుల నష్టాలు రూ.1,924 కోట్లకు పైగా ఉన్నాయని చెప్పింది. అడ్రియాల యూజీ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి మొత్తం వ్యయం రూ.30,333 కాగా విక్రయ ధర రూ.2,492 మాత్రమే ఉందని సంస్థ వెల్లడించింది. టన్నుకు ఏకంగా రూ.27,841 నష్టం వాటిల్లుతోందని.. ఈ ఒక్క గనిలోనే గతఏడాది రూ.302.87 కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొంది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్ కాస్ట్ గనులను నిర్వహిస్తోంది. ఉపరితల గనుల్లో భారీ యంత్రాలతో అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉండటంతో టన్నుకు ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుందని సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇలా భూగర్భ గనుల నష్టాలను ఓసీలతో వచ్చే లాభాలతో సరిచేస్తున్నారు. ఇవి లేకుంటే సింగరేణి సంస్థ ఈపాటికే నష్టాల్లో మునిగిపోయేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# మమతా బెనర్జీ మేనకోడలు అనుమానాస్పద మృతి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్):**

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనకోడలు బిర్భూమ్ జిల్లాలో అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. 28 ఏళ్ల బృష్టి ముఖర్జీ ఘటక్ మృతదేహాన్ని రామ్‌పూర్‌హాట్‌లోని ఆమె ఇంట్లో పోలీసులు మంగళవారం గుర్తించారు. ఇంటి రెండో అంతస్తులోని ఓ గదిలో మధ్యాహ్నం మృతదేహం కనిపించడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని రామ్‌పూర్‌హాట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఆమె మృతికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియలేదని పోలీసు అధికారి తెలిపారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం.. బృష్టి కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. దీనికి చికిత్స కూడా తీసుకుంటున్నారు. మరోవైపు భర్తతో ఆమెకు విడాకుల ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే ఆమె మృతికి ఇవే కారణమని పోలీసులు నిర్ధారించలేదు. బృష్టి గతంలో ఉపాధ్యాయ నియామక వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. అక్రమంగా ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగం పొందారనే ఆరోపణలు వచ్చాయి.

# ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయండి

**పాకిస్థాన్ హైకోర్టు కీలక ఆదేశం జారీ**
**పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ కు ఊరట**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్):**

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇస్లామాబాద్ హైకోర్టు నుంచి పెద్ద ఎత్తున ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఖైదులో ఉన్న వీరిని ఏకాంత నిర్బంధంలో ఉంచరాదని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్ సోమ్రో నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రాన్ ఖాన్ దంపతులను ఒంటరిగా ఉంచే పద్ధతికి స్వస్తి పలికి, జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలి. ఇమ్రాన్, బుష్రా సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పించాలి. జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలి. ఆయన కుమారులతో ఫోన్లో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి.ప్రతిరోజూ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు, పుస్తకాలు అందజేయడంతో పాటు, జైలు నిబంధనలకు అనుగుణంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి.ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అవినీతి కేసుల్లో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు జైల్లో సరైన వసతులు కల్పించడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు కొద్దికాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో... హైకోర్టు నుంచి ఈ సానుకూల తీర్పు వెలువడటం గమనార్హం.

# ఆయిల్ పామ్ రైతుల భారీ నజరానా

**టన్ను గెలల ధర రూ.24,025కు పెరుగుదల**
**ఆయిల్ పామ్ చరిత్రలో తొలిసారిగా పెంపు**

**హైదరాబాద్,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్):**

ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పంట పండింది. ఆయిల్ పామ్ గెలల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. టన్ను గెలల ధర రూ.24,025కు పెరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగు చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు తెలిపారు. దీంతో ఆయిల్ పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై నెలలో టన్ను గెలలకు రూ.23,783 ధర అమలులో ఉండగా.. ఆగస్టు చివరి నాటికి మరో రూ.242 పెరిగి రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లలో పామాయిల్ ధరల కదలికలు, ఉత్పత్తి పరిస్థితులు తదితర అంశాల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక గెలల ధర పెరగడమే కాకుండా రైతులకు చెల్లింపుల విషయంలోనూ ఆయిల్‌ఫెడ్ కీలక మైలురాయిని చేరింది. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.175 కోట్లను ఆయిల్ పామ్ రైతులకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని రైతులకు చెల్లించడం సంస్థ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఆయిల్ పామ్ పంటకు సాధారణ పంటలతో పోలిస్తే దీర్ఘకాలిక పెట్టుబడి, నిర్వహణ అవసరమైనప్పటికీ.. గెలల ధరలు మెరుగ్గా ఉంటే రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రికార్డు ధర నమోదవడం వల్ల సాగు విస్తీర్ణం పెంచుకోవాలనుకునే రైతుల్లోనూ ఆసక్తి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. నీటి వసతి, నాట్లకు సంబంధించిన సహాయం, డ్రిప్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు మార్కెటింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పామాయిల్ దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం కూడా ఆయిల్ పామ్ సాగు విస్తరణ వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ గెలలకు రికార్డు ధర లభించడం తమకు ఎంతో ఊరటనిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, నీటి నిర్వహణ వంటి వ్యయాలు పెరుగుతున్న సమయంలో గెలలకు లభిస్తున్న మెరుగైన ధర ఆదాయాన్ని పెంచుతుందని చెబుతున్నారు. ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే ఆయిల్ పామ్ సాగు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎలక్ట్రిక్ బస్సుల్లో డిజిటల్ అడ్వర్టయిజింగ్

**ప్రయోగాత్మకంగా అమలుకు ఆర్టీసీ అడుగులు**

**హైదరాబాద్,సెప్టెంబర్1(జై భీమ్ న్యూస్):**

ప్రయాణికులకు ఆధునిక ప్రయాణ అనుభూతిని అందించడంతో పాటు టికెట్ల ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవడంపై తెలంగాణ ఆర్టీసీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలో నడిచే ఎలక్ట్రిక్ బస్సుల్లో డిజిటల్ అడ్వర్టయిజింగ్, ఇన్ఫోటైన్‌మెంట్ తెరలను ఏర్పాటు చేస్తోంది. రూట్‌వేవ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న ఆర్టీసీ.. ప్రయోగాత్మకంగా హయత్‌నగర్-2 డిపోకు చెందిన పది ఎలక్ట్రిక్ బస్సుల్లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. పైలట్ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ తెరల పనితీరు, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం, ప్రయాణికుల స్పందన తదితర అంశాలను అంచనా వేయనున్నారు. ప్రయోగం విజయవంతమైతే నగరంలోని ఇతర డిపోల పరిధిలో నడిచే ఎలక్ట్రిక్ బస్సులతో పాటు అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులకు ఈ సాంకేతికతను విస్తరించే అవకాశం ఉంది. తద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించడంతో పాటు ఆర్టీసీకి అదనపు ఆదాయ వనరును అభివృద్ధి చేయాలన్నది సంస్థ ఉద్దేశంగా కనిపిస్తోంది.నగరంలోని రద్దీగా ఉండే లాంగ్‌రూట్లలో ఒకటైన హయత్‌నగర్--పటాన్‌చెరు మార్గాన్ని పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఈ మార్గంలో నడిచే పది ఆధునిక ఎలక్ట్రిక్ బస్సుల్లో డిజిటల్ తెరలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. గతంలో బస్సుల్లో డిజిటల్ స్క్రీన్లను ప్రధానంగా వినోద కార్యక్రమాలు, వాణిజ్య ప్రకటనల ప్రదర్శనకు వినియోగించేవారు. ప్రస్తుతం అందుబాటులోకి తెస్తున్న వ్యవస్థను మరింత ప్రయోజనకరంగా మార్చేందుకు ఇన్ఫోటైన్‌మెంట్ సదుపాయాలను జోడిస్తున్నారు. ప్రయాణికులకు ఉపయోగపడేలా మెట్రోరైలు తరహాలో రాబోయే బస్‌స్టాప్ వివరాలను స్క్రీన్లపై ప్రదర్శించే విధానాన్ని అమలు చేస్తున్నారు. బస్సు వెళ్లే మార్గంలోని ప్రధాన స్టేజీలు, ఆయా స్టాప్‌ల పేర్లను ముందుగానే డిజిటల్ వ్యవస్థలో పొందుపరుస్తారు. బస్సులో కొత్తగా ప్రయాణించే వారికి, నగర మార్గాలపై అవగాహన లేని వారికి ఈ సదుపాయం ఉపయోగకరంగా ఉండనుంది. రాబోయే స్టాప్ వివరాలను ముందుగానే తెలుసుకోవడం వల్ల ప్రయాణికులు తమ గమ్యస్థానం వద్ద దిగేందుకు సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది. డిజిటల్ తెరలను కేవలం వాణిజ్య ప్రకటనలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించేందుకు కూడా ఆర్టీసీ ప్రణాళిక రూపొందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సేవలు, ఆర్టీసీ అందిస్తున్న వివిధ సదుపాయాలు, ప్రయాణికులకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ఈ తెరల ద్వారా చేరవేయాలని భావిస్తోంది. ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రయాణికుల సమాచార వేదికలుగా కూడా ఉపయోగించుకోవచ్చని ఆర్టీసీ భావిస్తోంది. ఒకవైపు ఆధునిక సాంకేతికతతో ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడం, మరోవైపు ప్రకటనల ద్వారా నాన్-ఫేర్ రెవెన్యూను పెంచుకోవడం ద్వారా సంస్థ ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# ఇంట్లోనే రెస్టారెంట్ స్టైల్ చిల్లీ ఎగ్స్!

ఘాటు రుచితో నోరూరించే స్పెషల్ ఎగ్ రెసిపీ

పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చే క్రిస్పీ వంటకం

సులభమైన చిట్కాలతో రెస్టారెంట్ టేస్ట్ మీ ఇంట్లోనే

స్టీమ్ చేసి ఫ్రై చేయడం వల్ల మరింత ప్రత్యేక రుచి

వీకెండ్ స్పెషల్‌గా తప్పక ట్రై చేయాల్సిన డిష్



కొత్త స్వరం – లైఫ్‌స్టైల్ డెస్క్:
ఎగ్స్‌తో చేసే వంటకాల్లో చిల్లీ ఎగ్స్ ఒక ప్రత్యేకమైన వంటకం. ఘాటుగా, క్రిస్పీగా, రెస్టారెంట్ స్టైల్‌లో ఉండే ఈ రెసిపీని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. కొన్ని చిన్న చిట్కాలు పాటిస్తే బయట హోటల్‌లో దొరికే రుచిని మీ కిచెన్‌లోనే ఆస్వాదించవచ్చు. పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చే ఈ స్పైసీ డిష్‌ను వీకెండ్ స్పెషల్‌గా లేదా సాయంత్రం స్నాక్‌గా కూడా వడ్డించవచ్చు.

## కావాల్సిన పదార్థాలు గుడ్ల మిశ్రమం కోసం

గుడ్లు – 6
మైదా – 1½ టేబుల్ స్పూన్లు
కార్న్ ఫ్లోర్ – 1 టేబుల్ స్పూన్
నీరు – 4–5 టేబుల్ స్పూన్లు
పచ్చిమిర్చి తరుగు – 1 టీస్పూన్
కారం – 1 టీస్పూన్
ఉప్పు – తగినంత

చిల్లీ ఎగ్స్ కోసం
నూనె – 4 టేబుల్ స్పూన్లు
అల్లం తరుగు – 1 టేబుల్ స్పూన్
వెల్లుల్లి తరుగు – 1 టేబుల్ స్పూన్
ఉల్లిపాయ తరుగు – 4 టేబుల్ స్పూన్లు
పచ్చిమిర్చి చీలికలు – 2
క్యాప్సికం ముక్కలు – ½ కప్పు
చిల్లీ లేదా షెజ్వాన్ సాస్ – 1 టేబుల్ స్పూన్
రెడ్ చిల్లీ సాస్ – 1 టేబుల్ స్పూన్
గ్రీన్ చిల్లీ సాస్ – 1 టేబుల్ స్పూన్
వేడి నీరు – ½ కప్పు
డార్క్ సోయా సాస్ – 1 టీస్పూన్
వెనిగర్ – 1 టీస్పూన్
మిరియాల పొడి – 1 టీస్పూన్
అరోమాటిక్ పౌడర్ – 1 టీస్పూన్
వైట్ పెప్పర్ – ½ టీస్పూన్
చక్కెర – 1 టీస్పూన్
ఉప్పు – తగినంత
కొత్తిమీర – అలంకరణకు

### తయారీ విధానం..

ముందుగా గుడ్లను ఒక గిన్నెలో పగలగొట్టి పచ్చిమిర్చి తరుగు, కారం, ఉప్పు వేసి బాగా బీట్ చేయాలి. నెయ్యి లేదా నూనె రాసిన కేక్ టిన్‌లో ఈ మిశ్రమాన్ని పోసి, స్టీమర్‌లో 15 నిమిషాల పాటు ఉడికించాలి. చల్లారిన తర్వాత బయటకు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. తర్వాత మైదా, కార్న్ ఫ్లోర్, కొద్దిగా నీటితో మృదువైన పిండిని తయారు చేయాలి. గుడ్ల ముక్కలను ఈ పిండిలో ముంచి వేడి నూనెలో గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చే వరకు వేయించి పక్కన పెట్టాలి. ఇప్పుడు మరో పాన్‌లో నూనె వేడి చేసి అల్లం, వెల్లుల్లి వేయించి, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, క్యాప్సికం వేసి స్వల్పంగా వేయించాలి. అనంతరం చిల్లీ సాస్, షెజ్వాన్ సాస్, రెడ్ చిల్లీ సాస్, గ్రీన్ చిల్లీ సాస్, వేడి నీరు వేసి కలపాలి. తర్వాత సోయా సాస్, వెనిగర్, మిరియాల పొడి, వైట్ పెప్పర్, అరోమాటిక్ పౌడర్, చక్కెర, ఉప్పు వేసి సాస్ చిక్కబడే వరకు ఉడికించాలి. చివరగా వేయించిన గుడ్ల ముక్కలను సాస్‌లో వేసి ఒక నిమిషం పాటు బాగా కలిపి కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి.

రుచికరమైన చిట్కాలు..


- **గుడ్లను స్టీమ్ చేయడం వల్ల ముక్కలు విరగకుండా ఉంటాయి.**
- **హై ఫ్లేమ్‌పై సాస్ కలిపితే రెస్టారెంట్ స్టైల్ రుచి వస్తుంది.**
- **చివర్లో గుడ్లను ఎక్కువసేపు ఉడికించకండి. అప్పుడు క్రిస్పీనెస్ అలాగే ఉంటుంది.**
- **మరింత ఘాటు కావాలంటే షెజ్వాన్ సాస్ పరిమాణాన్ని కొద్దిగా పెంచుకోవచ్చు.**

ఇక ఆలస్యం ఎందుకు... ఇంట్లోనే ఈ రెస్టారెంట్ స్టైల్ స్పైసీ, క్రిస్పీ చిల్లీ ఎగ్స్ తయారు చేసి కుటుంబ సభ్యులను రుచితో మెప్పించండి.

# టూత్ బ్రష్ ఎన్ని రోజులకు మారుస్తున్నారు?

చాలా మంది రోజుల తరబడి ఒకే బ్రష్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ పద్ధతి సరైనది కాదు. కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్రష్‌లను మార్చాలి. బ్రష్‌లు అరిగిపోయిన తర్వాత కూడా చాలా మంది వాటిని ఉపయోగించడం కొనసాగిస్తారు. ఈ రకమైన బ్రష్‌ను అస్సలు ఉపయోగించకూడదు. నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అంటే కేవలం పళ్ళు తోముకోవడం మాత్రమే కాదు. నోటి ఆరోగ్యం కోసం చాలా మంది సాల్టెడ్ టూత్‌పేస్ట్‌తో బ్రష్ చేసుకుంటారు. కానీ అసలు సమస్య వేరే చోట ఉంది. నోటి ఆరోగ్యం చాలావరకు టూత్ బ్రష్ మీద ఆధారపడి ఉంటుందని దంత వైద్యులు అంటున్నారు. చాలా మంది రోజుల తరబడి ఒకే బ్రష్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ పద్ధతి సరైనది కాదు. కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్రష్‌లను మార్చాలి. బ్రష్‌లు అరిగిపోయిన తర్వాత కూడా చాలా మంది వాటిని ఉపయోగించడం కొనసాగిస్తారు. ఈ రకమైన బ్రష్‌ను అస్సలు ఉపయోగించకూడదు. ఏదైనా అంటు వ్యాధి నుండి కోలుకున్న తర్వాత మీ టూత్ బ్రష్‌ను మార్చడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఆ వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా లాలాజలంలో ఉండి, బ్రష్ పొడవైన కమ్మీలలో ఎక్కువ కాలం ఉంటుంది. ఆ కుంచె నుంచి ఆ వ్యాధి తరువాత మళ్ళీ వ్యాపిస్తుంది. దంతాల వెలికితీత తర్వాత లేదా నోటి లోపల ఏ రకమైన శస్త్రచికిత్స జరిగినా.. ఆ తర్వాత మీ టూత్ బ్రష్‌ను ఖచ్చితంగా మార్చడం కూడా మర్చిపోవద్దు. ఇటీవల, దంతాలను తోముకోవడానికి ఎలక్ట్రిక్ టూత్ బ్రష్‌ల వాడకం అందుబాటులోకి వచ్చింది. ఈ బ్రష్ హెడ్‌ను కూడా ప్రతి రెండు నుండి మూడు నెలలకు ఒకసారి మార్చాలి. సాధారణ బ్రష్‌ల కంటే ఇలాంటి బ్రష్‌ల ముళ్ళగరికెలు త్వరగా అరిగిపోతాయని వైద్యులు అంటున్నారు.





# ఈ చిన్న అలవాట్లతో.. పిల్లల జ్ఞాపకశక్తికి పదును..!

క్రమబద్ధమైన చదువుతో మెరుగైన మేధాశక్తి

ఫ్లాష్‌కార్డ్స్, మైండ్ మ్యాప్స్‌తో సులువైన అభ్యాసం

చిన్న భాగాలుగా చదవడం వల్ల ఎక్కువకాలం గుర్తింపు

పునర్విమర్శ, విజువల్ లెర్నింగ్‌తో మెమరీ పవర్ పెంపు

నిద్ర, పోషకాహారం, వ్యాయామం కూడా జ్ఞాపకశక్తికి కీలకం

కొత్త స్వరం – లైఫ్ స్టైల్ డెస్క్:
పిల్లలు చదివిన విషయాలను ఎక్కువకాలం గుర్తుంచుకోవాలంటే కేవలం ఎక్కువసేపు చదవడం సరిపోదు. సరైన అభ్యాస పద్ధతులు, మంచి అలవాట్లు కూడా అవసరం. నిపుణుల అభిప్రాయం ప్రకారం చురుకైన అభ్యాసం, విజువల్ లెర్నింగ్, ఫ్లాష్‌కార్డ్స్, మైండ్ మ్యాప్స్ వంటి పద్ధతులు పిల్లల జ్ఞాపకశక్తిని గణనీయంగా పెంచుతాయి. ప్రతిరోజూ ఒకే సమయంలో చదివే అలవాటు పెంపొందిస్తే క్రమశిక్షణతో పాటు మెదడు సమాచారాన్ని సులభంగా నిల్వ చేసుకుంటుంది. క్లిష్టమైన అంశాలను చిన్న పదాలు, ప్రాసలు లేదా గుర్తుంచుకునే సంకేతాల రూపంలో నేర్చుకోవడం ద్వారా అవగాహన మరింత పెరుగుతుంది. అలాగే చదివిన విషయాలను ఇతరులకు వివరించడం లేదా చర్చించడం ద్వారా అవి మెదడులో బలంగా నిలిచిపోతాయి. ఒకేసారి ఎక్కువ సమాచారం చదవడం కంటే చిన్న చిన్న భాగాలుగా విభజించి చదివే చంకింగ్ పద్ధతి మెరుగైన ఫలితాలను ఇస్తుంది. ముఖ్యమైన అంశాలను ఫ్లాష్‌కార్డ్స్‌పై రాసుకుని తరచూ పునర్విమర్శ చేస్తే గుర్తుంచుకోవడం సులభమవుతుంది. చిత్రాలు, మైండ్ మ్యాప్స్, రంగుల నోట్స్ వంటి విజువల్ పద్ధతులు కూడా మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. చదివిన విషయాలను కథల రూపంలో ఊహించుకోవడం వల్ల అవగాహనతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. స్పేస్డ్ రిపిటిషన్ విధానంలో నిర్ణీత వ్యవధిలో పునర్విమర్శ చేయడం ద్వారా నేర్చుకున్న అంశాలు ఎక్కువకాలం గుర్తుంటాయి. అంతేకాకుండా తగినంత నిద్ర, సమతుల్య పోషకాహారం, క్రమమైన వ్యాయామం పిల్లల ఏకాగ్రతను పెంచి మెదడు చురుకుగా పనిచేసేలా చేస్తాయి. ఈ చిన్న చిన్న అలవాట్లను రోజువారీ జీవితంలో భాగం చేస్తే పిల్లలు చదువుపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు జ్ఞాపకశక్తిని కూడా గణనీయంగా మెరుగుపరుచుకోవచ్చు.



# గోళ్లు కొరకడం మానేయండి!

జ్యోతిష్య విశ్వాసాల ప్రకారం శని ప్రభావంపై చర్చ

ఆర్థిక, మానసిక ఇబ్బందులు వస్తాయని నమ్మకం

ఆరోగ్యపరంగా కూడా గోళ్లు కొరకడం మంచిది కాదు

పిల్లలు, పెద్దలు ఇద్దరూ ఈ అలవాటుకు దూరంగా ఉండాలి

మంచి అలవాట్లు జీవితానికి మేలు చేస్తాయి

కొత్త స్వరం – లైఫ్‌స్టైల్ డెస్క్:
గోళ్లు కొరకడం చాలా మందిలో కనిపించే సాధారణ అలవాటు. ఇది చిన్నపిల్లలకే కాదు, పెద్దలలో కూడా కనిపిస్తుంది. ఆరోగ్య నిపుణులు ఈ అలవాటును పరిశుభ్రత, దంత ఆరోగ్య పరంగా మానుకోవాలని సూచిస్తారు. అదే సమయంలో, జ్యోతిష్య శాస్త్రంలోని కొన్ని విశ్వాసాల ప్రకారం కూడా గోళ్లు కొరకడం శుభప్రదం కాదని చెబుతారు. ఈ అభిప్రాయాలు శాస్త్రీయంగా నిర్ధారించబడిన విషయాలు కాకుండా సంప్రదాయ జ్యోతిష్య విశ్వాసాలపై ఆధారపడినవని గుర్తుంచుకోవాలి. జ్యోతిష్య విశ్వాసాల ప్రకారం శని గ్రహాన్ని గోళ్లు, ఎముకలతో అనుసంధానిస్తారు. అందువల్ల గోళ్లు కొరకడం వల్ల శని బలహీనపడుతుందని, దాని ప్రభావంగా జీవితంలో ఆటంకాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని కొందరు జ్యోతిష్యులు పేర్కొంటారు. ఉద్యోగం, కుటుంబ జీవితం, ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వారు విశ్వసిస్తారు. అలాగే రాహు, కేతువుల ప్రభావం కూడా పెరిగి అనుకోని సమస్యలు, ఆందోళన, ఆత్మవిశ్వాసం లోపించడం వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని జ్యోతిష్య అభిప్రాయాలు చెబుతున్నాయి. సూర్య గ్రహం బలహీనపడితే గౌరవం, నాయకత్వ లక్షణాలు, ఉద్యోగ పురోగతిపై ప్రభావం ఉంటుందని కూడా కొన్ని సంప్రదాయ నమ్మకాలు పేర్కొంటాయి. ఇంకా లక్ష్మీదేవికి గోళ్లు కొరకడం ఇష్టం ఉండదని, ఈ అలవాటు వల్ల ఇంటి శ్రేయస్సు, ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుందని పెద్దలు చెప్పే విశ్వాసం కూడా ఉంది. అందుకే గోళ్లు కొరకడం వంటి అలవాట్లను మానుకోవాలని సూచిస్తారు. ఆరోగ్యపరంగా చూస్తే గోళ్ల కింద ఉండే సూక్ష్మక్రిములు నోటిలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, గోళ్ల దెబ్బతినడం, దంతాల సమస్యలు వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల ఆరోగ్య కారణాల దృష్ట్యా కూడా ఈ అలవాటును మానుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ముగింపుగా, గోళ్లు కొరకడం ఆరోగ్యపరంగా మానుకోవాల్సిన అలవాటు. జ్యోతిష్య విశ్వాసాలను నమ్మేవారు వాటి ప్రకారం కూడా ఈ అలవాటుకు దూరంగా ఉండాలని భావిస్తారు. మంచి అలవాట్లు అలవరచుకోవడం వ్యక్తిగత ఆరోగ్యానికీ, క్రమశిక్షణకీ ఉపయోగకరంగా ఉంటుంది.